పకడ్బందీగా పశు గణన సర్వే

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో పశు గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌కుమార్, పశు వైద్యులతో కలిసి 21వ అఖిల భారత పశు గణన తెలంగాణ కార్యక్రమ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గణన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పశువుల వివరాలు సేకరించి ప్రభుత్వం నిర్ణయించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో గణన కోసం 86 మంది ఎన్యుమరేటర్లు, 11 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు పేర్కొన్నారు. నోడల్ అధికారి డా. విజయ్, పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు, చిత్రంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌కుమార్, సిబ్బంది

ఉద్యోగావకాశాలపై విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సతీష్ మాట్లాడుతూ.. విద్యార్థులు డిగ్రీ నుంచే వివిధ పత్రికలు చదవడం, పోటీ పరీక్షల పుస్తకాలను అధ్యయనం చేయాలని సూచించారు. డిగ్రీ అనంతరం ఉన్న వివిధ ఉద్యోగాలపై వివరించారు. ప్రిన్సిపల్ శ్రీదేవి, కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌ఛార్జి డాక్టర్ లక్ష్మీనరసింహం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒక వైపు బెబ్బులి.. మరో వైపు గజరాజు



● ఉమ్మడి జిల్లావాసుల్ని వణికిస్తున్న మృగాలు


ఆవాసం కోసం, తోడు కోసం వెతుక్కుంటూ వస్తున్న పులులు సరైన గమ్యస్థానానికి చేరుకునే క్రమంలో అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నాయి. ఈ మార్గంలో మనుషులకు కనిపించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యాఘ్రం లేదా మనిషి మృత్యువాతపడుతున్నారు. మరోవైపు ఏనుగు సైతం ప్రాణహిత నదిని దాటి కుమురం భీం జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురిని చంపేసిన ఏనుగు తెలంగాణలోకి వస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -ఈనాడు, ఆసిఫాబాద్

పులుల అభయారణ్యాల నుంచి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్ విస్తరించి ఉండగా, వీటి చుట్టూ మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి అభయారణ్యాలు ఉన్నాయి. వీటిలో ఏటా 30-40 వరకు పులి పిల్లలు జన్మిస్తున్నాయి. ఆవాసం వెతుక్కునే క్రమంలో కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా అడవులకు ఇవి వస్తున్నాయి. ఇలా వస్తున్నవి నేరుగా కవ్వాల్‌కు చేరుకోలేకపోతున్నాయి. నాలుగు వరుసల రహదారి, బొగ్గు ఉపరితల గనులు, పోడు వ్యవసాయం, ప్రాజెక్టుల నిర్మాణం వీటిని కవ్వాల్‌వైపు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నాయి.

ఒకటి నిలకడగా ఉంది

కవ్వాల్ ఉడుంపూర్ అటవీ ప్రాంతంలో ఒక పులి నివాసం ఏర్పర్చుకోవడం పట్ల అటవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కెరమెరి మండలంలోని ఇందాపూర్ అటవీ ప్రాంతంలో ఆడ పులి సంచరిస్తుంది. వర్షం రోజుల్లో రెండు ఆవులను ఈ పులి చంపేసింది. ఈ పులి కవ్వాల్‌కు వెళితే జతకట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. తిప్పేశ్వర్ నుంచి వచ్చిన మగపులి భీంపూర్, బోథ్, సారంగాపూర్ మీదుగా కవ్వాల్‌కు చేరుకుంటుందా లేదా అని కొద్ది రోజుల్లో తేలిపోతుంది.



ఏనుగు కదలికలపై అప్రమత్తంగా ఉన్నాం

నీరజ్‌కుమార్, కుమురంభీం జిల్లా అటవీ శాఖ అధికారి

ప్రాణహిత నది సమీపంలో తెలంగాణ చింతలమానేపల్లి మండల అటవీ ప్రాంతానికి 30-35 కిలోమీటర్ల దూరంలో ఏనుగు సంచరిస్తోంది. డ్రోన్ కెమెరాలతో ఈ ఏనుగును నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రాణహిత నదీ తీరం వెంబడి ఉన్న బెజ్జూర్, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాల ఆయా గ్రామాల ప్రజలు రాత్రి ఆరు గంటల అనంతరం ఎవరు పంటచేల వద్దకు వెళ్లవద్దు.

ఏప్రిల్ నెలలో కుమురం భీం జిల్లాకు వచ్చిన ఏనుగు

✸ ఈ ఏడాది ఏప్రిల్‌లో కుమురం భీం జిల్లాకు వచ్చిన ఏనుగు పెంచికల్‌పేట్, చింతలమానేపల్లి మండలాల్లో ఇద్దరు రైతులను తొక్కి చంపేసింది. రెండు రోజుల అనంతరం ప్రాణహిత నదిని దాటి మహారాష్ట్ర జిల్లాలోని గడ్చిరోలి అడవులకు వెళ్లింది. ఈ ఏనుగు మహారాష్ట్రలోనే ఉన్నా, ప్రస్తుతం తెలంగాణలోని చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల వైపు వస్తుందని అటవీ అధికారులకు పొరుగు రాష్ట్ర అధికారులు సమాచారం అందించారు. వారం క్రితం గడ్చిరోలి జిల్లాలో ఓ యువకుడు ఏనుగుతో సెల్ఫీ తీసుకునే క్రమంలో సైతం ఇదే ఏనుగు తొక్కి చంపేసింది.

జత కోసం వెతుకులాట..

న్యూస్‌టుడే, బోథ్ : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో మూడు రోజులుగా తిరుగుతున్న పెద్దపులి.. గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో ప్రత్యక్షమైంది. పశువులపై దాడిచేసి చంపుతుండటంతో రెండు మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ సిబ్బందికి నాలుగు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దాదాపు 20 మంది బేస్ క్యాంపు సిబ్బంది పులి జాడ కోసం అడవిని జల్లెడ పడుతున్నారు. ఇది మగ పులిగా అటవీ సిబ్బంది నిర్ధారించారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం సైతం తన తోడును వెతుక్కుంటూ మహారాష్ట్ర నుంచి బోథ్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోకి వచ్చిందని భావిస్తున్నారు. తోడును వెతుక్కునే క్రమంలో కంటికి కనిపించిన పశువులపై కోపంతో దాడి చేసి చంపుతోంది. బుధవారం చింతగూడ అటవీ ప్రాంతంలో ఎద్దుపై దాడి చేసి చంపింది. కానీ మాంసాన్ని మాత్రం తినలేదు.

తిప్పేశ్వర్ నుంచి..

-పుండలిక్, ఇన్‌ఛార్జి ఎఫ్‌ఆర్వో, బోథ్

బోథ్ మండలం వజ్జర్, చింతగూడ అటవీ ప్రాంతంలో వ్యాఘ్రం సంచరిస్తుందనే మాట వాస్తవమే. రెండు రోజులుగా పులి కదలికలను గమనించాం. తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుంచి భీంపూర్ మీదుగా బోథ్ మండలంలోని వజ్జర్ అటవీ ప్రాంతానికి వచ్చింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అటవీ ప్రాంతానికి వెళ్లొద్దు. పశువులను తీసుకెళ్లొద్దు.

ఎడతెగని.. వివాదం

లారీ అసోసియేషన్.. ఎస్పీఎం మిల్లు యాజమాన్యం మధ్య కుదరని సయోధ్య



కాగితం పరిశ్రమ ముందు కర్ర లారీలు

ఈనాడు, ఆసిఫాబాద్ :

కాగజ్‌నగర్ మిల్లులో ఉత్పత్తి చేసిన కాగితాన్ని ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లే లారీల అద్దె విషయంలో నెలకొన్న వివాదం నెల రోజుల నుంచి కొనసాగుతూనే ఉంది. తెలంగాణలోని పలు జిల్లాలతోపాటు ఆంధ్రా ప్రాంతం నుంచి నిత్యం 50-100 వరకు సుబాబుల్, మామిడి, జామాయిల్, నీలగిరి కర్రలతో లారీలు వస్తాయి. మిల్లులో ఒక్కరోజు 320-350 టన్నుల కాగితాన్ని ఉత్పత్తి చేస్తారు. కాగితాన్ని మిల్లు యజమానులు ఇతర ప్రాంతాలకు పంపిస్తారు. స్థానికులకు ఉపాధి కల్పించాలని వివిధ ప్రాంతాల్లోని 14 మార్గాల్లో లారీ కాగితాన్ని తీసుకెళ్లడానికి అసోసియేషన్‌కు అవకాశం కల్పించారు.

లారీ అద్దె 30 శాతం పెంచాలని డిమాండ్

కాగితం మిల్లులో 3500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. టన్ను కాగితాన్ని లారీల్లో తీసుకెళ్లడానికి యాజమాన్యం రూ.1525 చెల్లిస్తోంది. ఈ అద్దెను మరో 30 శాతం వరకు పెంచాలని లారీ అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు. పెరిగిన ఇంధనం ధరలతో గిట్టుబాటు కావడం లేదని వీరంతా వాపోతున్నారు. ఇందుకు యాజమాన్యం అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో పలుమార్లు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. మిల్లు యాజమాన్యం, లారీ అసోసియేషన్ సభ్యుల వివాదంతో సుదూర ప్రాంతాల నుంచి లారీల్లో కర్రలను తీసుకొచ్చే చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కాగితం పరిశ్రమను నమ్ముకుని సుబాబుల్, నీలగిరిని సాగు చేస్తే పంట చేతికొచ్చాక విక్రయించడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమ్మెతో రూ.కోట్లలో నష్టం

మిల్లులో తయారు చేసిన కాగితాన్ని కొంతమేరకు ఇతర లారీల్లో పంపిస్తున్నా.. అసోసియేషన్ సమ్మె వల్ల రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోందని తెలుస్తోంది. ఉత్పత్తి చేసిన కాగితాన్ని సకాలంలో ఆదేశాల ప్రకారం ఇతర ప్రాంతాలకు చేరిస్తేనే పరిశ్రమ మనుగడ సాధ్యమవుతుంది. వేలాది మందికి ఉపాధి కల్పించే దీనిలో నష్టం వస్తే అంతే సంగతులు. 2014 నుంచి 2018 వరకు కాగితం పరిశ్రమ మూతపడితే అనేక మంది పనిలేక సతమతమయ్యారు. అప్పటి ప్రభుత్వం రూ.800 కోట్ల వరకు రాయితీ కల్పించి పరిశ్రమకు జవసత్వాలు అందించింది. ప్రస్తుతం మిల్లులో కొనసాగుతున్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

దహెగాం, న్యూస్‌టుడే : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాబార్డ్ డీడీఎం వీరభద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో ఏడీసీసీ దహెగాం శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తమకు తెలియకుండా ఖాతాల నుంచి డబ్బులు పోయినట్లయితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఏడీసీసీ మేనేజర్ రిషిదేవ్, ఎఫ్‌ఎల్‌సి అంజన్న, సీఈవో బక్కయ్య, క్షేత్ర అధికారి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. నిరుద్యోగులకు శాపం!

అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్య ధోరణి కారణంగా కెరమెరి గ్రంథాలయ పరిస్థితి దయనీయంగా మారింది. మండలంలో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అధికారుల సమన్వయ లోపంతో దీని నిర్మాణానికి భూమి కేటాయించలేని దుస్థితి. గత్యంతరం లేక అద్దె భవనాల్లో అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది. గతంలో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓ చిన్న గదిలో గ్రంథాలయం ఏర్పాటు చేసి కొన్నాళ్ల పాటు కొనసాగించారు. తర్వాత కార్యాలయాన్ని కూల్చేసి దాదాపు అయిదేళ్ల కిందట అక్కడే రూ.లక్షలతో ఓ షెడ్డు నిర్మించారు. అప్పటి నుంచి అది నిరుపయోగంగా మారింది. ఈక్రమంలో గ్రంథాలయ ఊసే లేకుండాపోయింది. కొన్ని రోజుల కిందట అధికారులు హడావుడిగా ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. కొన్ని దినపత్రికలకే పరిమితమవుతోందని, ఎప్పుడు తెరచి ఉంటుందో మూస్తారో తెలియడం లేదని గ్రామ యువకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి షెడ్డులోనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుత పోటీ పరీక్షల నేపథ్యంలో ఇప్పటికైనా పరిష్కారం చూపాలంటున్నారు.

న్యూస్‌టుడే, కెరమెరి



పాత గ్రంథాలయం స్థలంలో కట్టిన షెడ్డు నిరుపయోగంగా ఇలా..



అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం.. (మూసివేసి ఉంది)

పంట నష్టపరిహారానికి రోడ్డెక్కిన అన్నదాతలు

బెజ్జూరు, న్యూస్‌టుడే : భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తూ బెజ్జూరు మండలంలోని పలుగ్రామాల అన్నదాతలు శుక్రవారం రోడ్డెక్కారు. బెజ్జూరు మండలం ప్రాణహిత, పెద్దవాగు సరిహద్దులోని తలాయి, తిక్కపల్లి, సోమిని, పాతసోమిని, నాగేపల్లి, గెర్రెగూడ, భీమారం, ఇప్పలగూడ తదితర గ్రామాల్లోని రైతులు సాగుచేసిన పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయినా పరిహారం మంజూరు చేయలేదని వాపోయారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వేలు చేయకపోవడంతోనే పరిహారం మంజూరు కాలేదని.. వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు, పాలనాధికారి వచ్చే వరకు ఆందోళనను విరమించుకోమని భీష్మించారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఆర్ఐ సంతోష్, కౌటాల సీఐ రమేష్, పోలీస్ సిబ్బంది చేరుకున్నారు. తహసీల్దార్ భూమేశ్వర్ మాట్లాడారు. నష్టపోయిన పంటల విషయంలో జిల్లా పాలనాధికారి, జిల్లా వ్యవసాయాధికారికి నివేదిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించుకున్నారు. అనంతరం రైతులు తహసీల్దారుకు వినతి పత్రాన్ని సమర్పించారు.



బెజ్జూరు ప్రధాన రోడ్డుపై బైఠాయించిన రైతులు, నాయకులు

వ్యవసాయాధికారులపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే

బెజ్జూరు మండలంలోని వ్యవసాయాధికారులపై చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు శుక్రవారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ కమిషనర్ బి.గోపికి ఫిర్యాదు చేశారు. బెజ్జూరు మండలంలోని ప్రాణహిత, పెద్దవాగు ప్రాంతంలో సాగు చేసిన పంటలు వరదలకు, భారీ వర్షాలకు నష్టపోయాయి. నష్టపరిహారం అందించడంలో వ్యవసాయాధికారులు అలసత్వం వహించి సర్వేలు తూతూ మంత్రంగా చేపట్టి చేతులు దులుపుకొన్నారని వ్యవసాయశాఖ కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సరిహద్దులో పటిష్ఠ భద్రత

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : మహారాష్ట్రలో శాసన సభ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం మహారాష్ట్ర డీజీపీ సరిహద్దు రాష్ట్రాల డీజీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ పాల్గొని మాట్లాడారు. జిల్లా నుంచి మహారాష్ట్రకు వెళ్లే నాలుగు మార్గాల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా డబ్బులు, మద్యం, ఇతర వస్తువులు తరలించకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశామన్నారు. మావోయిస్టుల కదలికలపై ఏరియా డామినేషన్ పార్టీలతో కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

కంకర వేశారు.. తారు మరిచారు

కెరమెరి నుంచి ఆసిఫాబాద్ వెళ్లే మార్గంలో రోడ్డు మరమ్మతులు కోసం గుంతలు, అధ్వానంగా ఉన్న చోట మరమ్మతుల కోసం కంకర వేశారు. కంకర వేసి సుమారు మూడు నెలలు అవుతుంది. నేటికీ తారు వేయలేదని.. వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నామని చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కెరమెరి



ఆటలకు చోటేది?

నిరాశలో గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

బెజ్జూరు, న్యూస్‌టుడే:

చక్కని ఆరోగ్యం, మానసికోల్లాసంతోపాటు శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయి. ఇటీవల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పలు క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటుతున్నారు. జిల్లాలోని చాలా వరకు పాఠశాలల్లో సరైన ఆట స్థలం, క్రీడా పరికరాలు అందుబాటులో లేవు. అంతేకాకుండా వ్యాయమ ఉపాధ్యాయులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. వారిలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నారు.

జిల్లాలో 896 ప్రాథమిక పాఠశాలలు, 108 ప్రాథమికోన్నత, 105 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 26 మంది పీడీలు, పీఈటీలు నలుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు నిబంధనల ప్రకారం.. ప్రాథమిక పాఠశాలకు 1.5 ఎకరాలు, ప్రాథమికోన్నతకు మూడు ఎకరాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 5 ఎకరాల స్థలం ఉండాలి. కానీ పలుచోట్ల ప్రార్థన చేయడానికి కూడా స్థలం లేనివి ఉన్నాయి. మరోవైపు మైదానాలు ఉన్నచోట ఆడించే వ్యాయమ ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు ఆటలకు ప్రోత్సాహం కరవవుతోంది.

జిల్లా వివరాలు		
మొత్తం పాఠశాలలు	:	1109
ప్రాథమిక ,,	:	896
ప్రాథమికోన్నత ,,	:	108
ఉన్నత ,,	:	105
దాదాపు 50 శాతానికి పైగా పాఠశాలలకు స్థలాలు లేవు		

క్రీడా ప్రాంగణాలున్నా..

ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా గత ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఒక క్రీడా ప్రాంగణాన్ని మంజూరు చేసింది. క్రీడా సామగ్రిని కూడా సమకూర్చింది. స్థలాలు ఉన్న చోట బాగానే ఉన్నా.. లేనిచోట మమ అనిపించారు. ఫలితంగా కొన్నిచోట్ల ప్రాంగణాలు బోర్డులకే పరిమితం కాగా, మరికొన్ని చోట్ల పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అందులోని సౌకర్యాలు, పరికరాల జాడ లేక వాటిపై పర్యవేక్షణ కరవైంది. మైదానం లేని లేని పాఠశాలలకు ఈ ప్రాంగణాలు కొంతలో కొంతైనా విద్యార్థులకు దోహదపడతాయని అనుకున్నా.. వాటి పరిస్థితి అధ్వానంగా మారడంతో అటువైపు చూసే వారే లేరు. ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తేవాల్సిన అవసరముంది.



బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఇది. 160 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడి విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉన్నప్పటికీ ఆడించే వారు లేక ఆడేందుకు స్థలం లేక వారు నిరాశకు గురవుతున్నారు. సరైన ఆట స్థలం లేదని, పీఈటీని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

- సునీత, ఎంఈఓ, బెజ్జూరు




ఆట స్థలం లేని పాఠశాలలు, వ్యాయమ ఉపాధ్యాయుల కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఈమేరకు ప్రతిపాదనలు పంపిస్తాం. మైదానం ఉండి పీఈటీ, పీడీలు ఉన్న చోట క్రీడలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో ఆటలు ఆడేలా చూస్తున్నాం.



పత్తి కొనుగోళ్లకు సీసీఐ ఏర్పాట్లు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలోని రైతులు సీసీఐకి పత్తిని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వాక్ హైమద్ ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ మొదటి వారంలో జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు మొదలవుతాయన్నారు. రైతులు సీసీఐకి విక్రయానికి తీసుకొచ్చే పత్తిలో 8-12 శాతం తేమ ఉండేలా చూసుకోవాలన్నారు.



(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

? కాగజ్‌నగర్-పెంచికల్‌పేట్ ప్రధాన రహదారి ఈజ్‌గాంలో రాత్రిపూట పశువులు రోడ్లపై ఆశ్రయం పొందుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - బి. శ్రీధర్‌గౌడ్, స్థానికుడు

✔ పశువులు రోడ్లపై ఆశ్రయం పొందకుండా పశువుల యజమానులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. - రమేశ్, ఎంపీడీవో, కాగజ్‌నగర్

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్

? పట్టణంలోని ఆదర్శనగర్ సమీపంలో మురుగు కాలువల్లో పూడిక తీయడంలేదు. పిచ్చిమొక్కలతో కాలువలు మూసుకుపోతున్నాయి. - శ్రీనివాస్, స్థానికుడు

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి మురుగు కాలువల్లో పూడికలు తీయిస్తాం. - శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కాగజ్‌నగర్

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

? జిల్లా కేంద్రంలోని బజార్‌వాడి జామియా మజీద్ సమీపంలో రోడ్డుపై తాగునీటి పైప్‌లైన్ లీకేజీ ఏర్పడింది. నీటి సరఫరా జరిగినపుడు శుద్ధ నీరు వృథాగా పోతుంది. - రషీద్, బజార్‌వాడి

✔ పరిశీలించి లీకేజీ మరమ్మతులు చేయిస్తాం. - భుజంగ్‌రావు, పుర కమిషనర్

దీపాల పండగొచ్చింది.. ఉపాధి తెచ్చింది

న్యూస్‌టుడే, కౌటాల, బెజ్జూరు :

ఆధునిక సమాజం కొత్తపుంతలు తొక్కుతోంది. అందుబాటులోకి వచ్చిన కొత్త వస్తువులు, సామగ్రితో అనేక కులవృత్తులకు ఆదరణ కరువైంది. దీంతో సదరు కుటుంబాలకు చేతినిండా పనిలేక జీవనోపాధి భారంగా మారుతోంది. చేతివృత్తినే జీవనోపాధిగా నమ్ముకున్న కుమ్మరులకు పండగలు వస్తేనే ఉపాధి లభించే పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పండగలొస్తే చాలు తమ నైపుణ్యానికి మెరుగులు దిద్దుకొని కులవృత్తిని కొనసాగిస్తున్న కుమ్మరులపై న్యూస్‌టుడే కథనం.

దసరా నవరాత్రులు, దీపావళి పండగ వచ్చిందంటే చాలు కుమ్మరి కళాకారులకు చేతినిండా పని లభిస్తోంది. ఈ పండగల్లో ప్రత్యేకంగా అమ్మవారికి మట్టి ప్రమిదలతో దీపారాధన చేసి పూజిస్తారు. అనాదిగా వస్తున్న మట్టి ప్రమిదల వాడకం కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్నప్పటికీ తిరిగి మట్టి ప్రమిదలపైనే ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో కుమ్మరులు వివిధ రకాల ప్రమిదలు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లావ్యాప్తంగా కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూరు, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలతో పాటు ఆసిఫాబాద్‌లోని వాంకిడి, కెరమెరి, జైనూర్ మండలాల్లోని కుమ్మరులు ప్రమిదలు తయారు చేసి మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్‌కు తరలిస్తుండటం విశేషం.


కౌటాల మండలం తలోడిలో మట్టి ప్రమిదలను తయారు చేస్తున్న దృశ్యం



కౌటాల మండలం తలోడి గ్రామానికి చెందిన కొండపల్లి శేఖర్ తన కుటుంబ సభ్యుల సహకారంతో లక్ష మట్టి ప్రమిదలను తయారు చేశాడు. గతంలో కంటే ఈ ఏటా పెద్దసంఖ్యలో ఆర్డర్లు ముందే రావడంతో నెలరోజుల ముందు నుంచే పనులు ప్రారంభించాడు. దసరా నవరాత్రులు, దీపావళి పండగ వచ్చిందంటే చాలు తమ కుటుంబానికి చేతినిండా పని దొరుకుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



బెజ్జూరు మండలం బారెగూడ గ్రామానికి చెందిన ఈయన పేరు సీహెచ్ రవి. వ్యవసాయ కుటుంబమే అయినా పండగొచ్చిందంటే చాలు తమ కులవృత్తిపై నిమగ్నమైపోతాడు. దసరా నవరాత్రి ఉత్సవాలు, దీపావళి పండగలకు అవసరమయ్యే మట్టి ప్రమీదలు తయారు చేసి వారాంతపు సంతల్లో విక్రయిస్తుంటాడు. ఈ ఏటా మట్టిప్రమీదలపై ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతుండటంతో 15 రోజుల ముందు నుంచే పనులు ప్రారంభించాడు. వాటిని ఆర్డరుపై వివిధ ప్రాంతాలకు పంపుతూ ఆదాయం గడిస్తున్నాడు.

వెలసిన ప్రచార హోర్డింగులు


వాంకిడిలో శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన హోర్డింగు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రచారాన్ని ప్రారంభించారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆశావహులు మండలాల్లో శుభాకాంక్షలు తెలుపుతూ పలు హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారు. మండల కేంద్రంలో జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో బరిలో దిగేందుకు ఆసక్తి కనబరుస్తున్న అభ్యర్థులకు సంబంధించిన హోర్డింగులు ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, వాంకిడి

తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి

లింగాపూర్, న్యూస్‌టుడే : మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీపీఎం అన్నాజీ, ఏపీఎం దేవానందం, లింగాపూర్ బ్యాంకు మేనేజర్ ముకేష్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

వందనం

కౌటాల, న్యూస్‌టుడే : మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రవి హెచ్చరించారు. శుక్రవారం ఈనాడులో 'అనాలోచిత నిర్ణయం.. కాలనీవాసులకు శాపం' అనే శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. శనివారం కౌటాల మండలకేంద్రంలోని రెండు మద్యం దుకాణాలను కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి, సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రహదారులపై వాహనాలు నిలుపకుండా తగు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. పర్మిట్‌రూంలలో సిట్టింగ్ ఏర్పాటు చేయవద్దని, ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.


కౌటాలలో మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ రవి

ఉత్తమ ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలి

రెబ్బెన, న్యూస్‌టుడే : కొత్తగా ఉద్యోగంలో చేరిన యువతీ, యువకులు నిబద్ధతతో పనిచేసి ఉత్తమ ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు, పదోన్నతి పొందిన వారికి పదోన్నతి పత్రాలను అందజేశారు. ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు మొగిలి, ఎస్‌ఓటూ జీఎం రాజమల్లు, డీజీఎం(లెడ్) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.


నియామక పత్రాలు, పదోన్నతి పత్రాలు అందుకున్న వారితో సింగరేణి అధికారులు

చంద్రపూర్ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

బల్లార్ష, న్యూస్‌టుడే : మహారాష్ట్రలో వచ్చే నెల 20న జరగనున్న శాసన సభ ఎన్నికలకు గాను 48 మందితో రాష్ట్ర కాంగ్రెస్ తొలి జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో చంద్రపూర్ జిల్లా రాజూర నియోజకవర్గం నుంచి ప్రస్తుత శాసనసభ్యులు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సుభాష్‌దోటే, శాసనసభ ప్రతిపక్షనేత విజయ్‌వాడెట్టివార్ బ్రహ్మపురి స్థానం నుంచి మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షుడు వార్జూర్‌కర్ చిమూర్ శాసనసభా స్థానం నుంచి పోటీచేస్తున్నట్లు జాబితాలో పేర్కొంది. జిల్లాలో బల్లార్‌పూర్, చంద్రపూర్, వరోర స్థానాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

పురుగు మందు తాగి ఒకరి ఆత్మహత్య

రెబ్బెన, న్యూస్‌టుడే : రెబ్బెన మండల కేంద్రానికి చెందిన రాంటెంకి వెంకటేష్ (48) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేష్‌కు మంచిర్యాలకు చెందిన సమీప బంధువు అయిన ఓ మహిళతో పరిచయం ఏర్పడి తరచూ మాట్లాడుతూ ఉండేవాడు. ఈ విషయం ఆమె కుటుంబ సభ్యులకు తెలియడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఇరువురికి నచ్చజెప్పారు. అప్పటి నుంచి వెంకటేష్ ఆమెతో మాట్లాడడం మానేశాడు. వివాహిత మాట్లాడకుంటే తాను చనిపోతానని బెదిరించడంతో తిరిగి సత్సంబంధాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో సదరు మహిళ తమ్ముడు వెంకటేష్, భర్త బానయ్యలు కక్ష పెంచుకుని వెంకటేష్‌ను చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేష్ గురువారం రాత్రి పురుగు మందుతాగాడు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సకు వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. శుక్రవారం మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


వెంకటేష్

45 రోజుల పసికందు మృతి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రిలో నిమోనియాతో బాధపడుతున్న 45 రోజుల పసికందు శుక్రవారం మృతి చెందింది. చింతగూడ గ్రామానికి చెందిన రాజు తన కుమారుడిని మూడు రోజుల క్రితం ఆసుపత్రిలో చేర్పించాడు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినట్లు రిపోర్టులు సైతం వచ్చాయి. ఉదయం రక్తనమూనా సేకరణ అనంతరం పసికందుకు తల్లి పాలివ్వగా ఊపిరితిత్తుల్లోకి తల్లిపాలు ప్రవేశించి మృతి చెందినట్టు వైద్యుడు తెలిపారు. ఘటనా స్థలానికి టౌన్ ఎస్సై సుధాకర్ చేరుకుని వివరాలు సేకరించారు.

చెత్త కదలదు.. కంపు వదలదు



జిల్లా కేంద్రంలోని బాపునగర్‌లో చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. గాలి వీచినపుడు చెత్త కాగితాలు, కవర్లు రోడ్డుపై కొట్టుకొచ్చి అపరిశుభ్రంగా మారుతుందని చెబుతున్నారు. ప్రైవేటు పాఠశాల ముందే ఇలా చెత్తాచెదారం ఉండటంతో వచ్చి పోయే వేళ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త, పిచ్చి మొక్కలు పెరిగి రాత్రివేళ దోమలతో రోగాలు సోకుతున్నాయని, విష కీటకాల బెడద ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుర అధికారులు స్పందించి చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

రెబ్బెన, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం రెబ్బెనలో కాంగ్రెస్ శ్రేణులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్, నాయకులు దేవాజీ, మురళి, చిరంజీవిగౌడ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపారు. భారాస ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహించిన రైతు పోరుబాట సభలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్... సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా చేశారు. కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.


రెబ్బెనలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అధిక లోడు లారీలు నియంత్రించాలని వినతి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : సిర్పూర్ పేపర్ మిల్లుకు కర్రలను తీసుకొస్తున్న లారీలు అధిక లోడ్‌తో వస్తున్నాయని, నియంత్రించాలని కోరుతూ శుక్రవారం లారీ అసోసియేషన్ సభ్యులు, కౌన్సిలర్లు పురపాలిక కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం పెట్రోల్ పంపు ఏరియా నుంచి మిల్లు వరకు కర్రలోడుతో వెళ్తున్న లారీలతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఒకే వరస రోడ్డు కావడంతో లారీ వెళ్తుంటే ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని, అధిక బరువు కారణంగా ప్రయాణికుల కళ్లలో దుమ్ము చేరి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు లారీ చౌరస్తాలో బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. లారీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కిశోర్‌బాబు, మాజిద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ దస్తగిర్, కౌన్సిలర్లు జైచందర్, శివప్రసాద్, ఎంఐఎం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ ముబిన్, జావిద్ మల్నాస్, నాయకులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు, కౌన్సిలర్లు

ప్లకార్డులు ధరించి నిరసన

రెబ్బెన, న్యూస్‌టుడే : రైల్వేలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను ఒప్పంద పద్ధతిలో తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణలో ప్లకార్డులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గెడాం టికానంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో విరమణ పొందిన 25 వేల మందిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే వీటిని నిలిపివేసి నిరుద్యోగ యువత కోసం నోటిఫికేషన్లు విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని స్టేషన్ మాస్టర్‌కు అందజేశారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, నాయకులు శ్రావణి, సతీష్, శివ తదితరులు పాల్గొన్నారు.


స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కొలవార్ మండల కార్యవర్గం ఏర్పాటు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయ ఆవరణలో కొలవార్ మండల కార్యవర్గం ఏర్పాటైంది. కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడిగా ఎరగటి విలాస్, ప్రధాన కార్యదర్శిగా బుర్స సురేశ్, ఉపాధ్యక్షులుగా ఇంజిరి నర్సింహులు, మెస్త్రం బాపు, కార్యదర్శులుగా గువ్వల భీమయ్య, బండి భీమయ్య, పిట్టల రామక్క, యువత కన్వీనర్‌గా మీసారపు సంతోష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు పారిపెల్లి పోశం ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మేర్పెల్లి సదాశివ్, ఉపాధ్యక్షుడు బుర్స రంగయ్య, యువత అధ్యక్షుడు బుర్స వెంకటేష్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.


కొలవార్ మండల కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పారిపెల్లి పోశం

రాజ్‌గోండ్ సేవా సమితి మండల కమిటీ ఎన్నిక

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండల రాజ్‌గోండ్ సేవా సమితి మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు డివిజన్ అధ్యక్షుడు సుర్పం మారు తెలిపారు. పట్టణంలోని డాడా నగర్ చౌరస్తాలోని కుమురంభీం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. గోండ్వాన రాయి సెంటర్ మండల సర్మేడిగా సుర్పం రాంచందర్, మండల ఉపమేడిగా సుర్పం గన్ను పటేల్, మండల రాయిమేడిగా మర్సుకోల చందు, మండల గీతాదార్‌గా సుర్పం సంతోష్, మండల కోశాధికారిగా సుర్పం మురళీ, కార్యవర్గ సభ్యులుగా సుర్పం తెలంగ్‌రావు, గోపాల్‌రావు, మేస్త్రం అర్జు, అడ భీంరావు, కొడప భీంరావు, నైతం శ్యాంరావు తదితరులను ఎన్నుకున్నట్లు చెప్పారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ

కాగజ్‌నగర్‌గ్రామీణం, న్యూస్‌టుడే : స్థానికంగా పనులు కల్పించి కూలీల వలసలు తగ్గించాలనే ఆశయంతో సర్కారు అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అందవెల్లి, బురదగూడ గ్రామాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులపై గ్రామసభలు నిర్వహించారు. ఏపీఓ బుచ్చన్న, సాంకేతిక సహాయకులు రమాదేవి, కిషోర్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, క్షేత్ర సహాయకులు సుధాకర్, పోశెట్టి, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

వాంకిడి, న్యూస్‌టుడే : బుద్ధుడి బోధనలు అనుసరణీయం, ఆదర్శనీయమని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు మహోల్కర్ అశోక్ అన్నారు. శుక్రవారం జెత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహించిన వర్షవాస్ గ్రంథ పఠనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే సంఘం శరణం గచ్ఛామి నాటికను ప్రదర్శించారు. మండల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జయరాం, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, సంఘం నాయకులు పాల్గొన్నారు.


వర్షవాస్ గ్రంథ పఠన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అంబేడ్కర్ సంఘం నాయకులు

పరిహారం ఇప్పించాలని సబ్‌కలెక్టరుకు వినతి

బెజ్జూరు, న్యూస్‌టుడే : బెజ్జూరు మండలంలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ మాజీ జడ్పీటీసీ పద్రం పుష్పలత, కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు అర్షహద్ హుస్సేన్ శుక్రవారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టరు శ్రద్ధా శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. మాజీ ఎంపీటీసీ ఆత్రం సాయి, నాయకులు నాహీర్‌అలీ, పెంటయ్యలు పాల్గొన్నారు.


సబ్‌కలెక్టరుకు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రజల రక్షణకు ప్రత్యేక కమిటీ

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే : ఏనుగు నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల స్థానిక అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఎస్సై కొమురయ్య ఈ నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంత గ్రామాలైన కొండపల్లి, లోడ్పల్లి, కమ్మర్గాం, మొర్గిగూడ గ్రామాలలో అవగాహన కల్పించారు. 15 మంది ఎనిమల్ ట్రాకర్స్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు ఏనుగు కదలికలపై మ్యాపును పరిశీలించారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్‌ని వివరణ కోరగా యాక్షన్ ప్లాన్ ఆఫ్ ఎలిఫెంట్ మూమెంట్‌లో భాగంగా అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు.


మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు

చెట్టు విరిగి.. ప్రమాదకరంగా మారి

మండలంలోని బొంబాయిగూడ-పెంచికల్‌పేట్ వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో బుడుగుల ప్రదేశంలో ఓ చెట్టు విరిగి రోడ్డుపై పడింది. ప్రమాదకరంగా ఉండటంతో రాత్రివేళల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెంచికల్‌పేట్



సంక్షిప్తం

ఉత్సాహంగా దసరా వేడుకలు

జైనూర్, న్యూస్‌టుడే : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భావి తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గోండి ధర్మ రాష్ట్ర కోయపుణ్యం కార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కుమురంభీం, జైనూర్ గ్రామ వ్యవస్థాపకుడు కొడప కాశీ పటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం దసరా వేడుకలతో పాటు కుమురంభీం వర్ధంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కుమురంభీం మనువడు కుమురం సోనేరావు, సహకార సంఘం ఛైర్మన్ కొడప హన్ను పటేల్, డీఎస్పీ కరుణాకర్, సీఐ రమేష్, ఎస్సై సాగర్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన


తిర్యాణి: సమాజ శ్రేయస్సు కోసమే పోలీసులు పనిచేస్తున్నారని తిర్యాణి ఎస్సై మాధవ్ అన్నారు. పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జడ్పీ పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాలు, ఖైదీల గదులు, షీటీం నిర్వహణపై అవగాహన కల్పించారు.

నేడు వెడ్మ రాము వర్ధంతి సభ

తిర్యాణి : మండలంలోని ఎదులపాడ్ గ్రామంలో వెడ్మ రాము వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు.

రెబ్బెన సీఐగా బాధ్యతల స్వీకరణ

రెబ్బెన: రెబ్బెన సీఐగా బుద్దె స్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ చిట్టిబాబు బదిలీపై హైదరాబాద్ ఐజీపీకి వెళ్లగా ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్‌లో సీసీఆర్బీలో పని చేస్తున్న బుద్దె స్వామి బదిలీపై వచ్చారు.


బుద్దె స్వామి సీఐ

పరామర్శ

బెజ్జూరు : సోమిని గ్రామానికి చెందిన గంజం జీవన్‌దాస్ పాముకాటుకు మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం జీవన్‌దాస్ కుటుంబాన్ని భాజపా నాయకులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు దిగెంబరు, రాజారాం, రాకేష్, సంతోష్, వసీఖాన్, శంకర్, రమేష్, తదితరులు ఉన్నారు.

కారోబార్ మృతిపై సంతాపం

దహెగాం : మండలంలోని అయినం గ్రామపంచాయతీకి చెందిన కారోబార్ జాడి మల్లయ్య గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుని కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.25 వేలను ఎంపీడీవో రాజేందర్ అందజేసి సంతాపం తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ ఆత్మారాం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సిర్పూర్(టి): మండలంలో కుల మతాలకు అతీతంగా ముస్లిం సోదరుడు అయ్యప్ప దేవాలయానికి తన వంతుగా ట్రాక్టర్ ఇటుక లోడు విరాళంగా అందించాడు. పేట్‌మైల కాలనీకి చెందిన రిజ్వాన్ ఉల్లా ఖాన్ అనే వ్యక్తి సిర్పూర్(టి)లో ఇటీవల ప్రతిష్ఠించిన అయ్యప్ప స్వామి ఆలయంలో కొన్ని పనులు మిగిలి ఉండగా విషయం తెలుసుకున్న యువకుడు ఇటుక లోడును ఇచ్చాడు.

ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణిలో పని చేస్తున్న ఒప్పంద కార్మికుల వేతనాలు తక్షణమే పెంచాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం రవీంద్రఖని-7 గని వద్ద మాట్లాడుతూ తమ పోరాటాల ఫలితంగా యాజమాన్యం సంస్థ లాభాల్లో వీరికి రూ.5 వేలు చెల్లించిందన్నారు. 2022లో కార్మిక సంఘాలతో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో వైద్య శిబిరం

వాంకిడి : చౌపన్‌గూడ పంచాయతీ ఖానాపూర్‌లో శుక్రవారం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు గ్రామంలో డ్రై డే (పొడి దినం) నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్, హెల్త్ అసిస్టెంట్ భగవందాస్, ఆశా కార్యకర్త జంగుబాయి, పీఎం జన్‌మన్ సభ్యులు దివ్య, హేమంత్ పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థిని అదృశ్యంపై కొనసాగుతున్న దర్యాప్తు

కాగజ్‌నగర్‌గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గన్నారం మహాత్మాజ్యోతిబా ఫులే బాలికల పాఠశాల, కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం అదృశ్యమైన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ సుస్మిత సెలవుపై వెళ్లడంతో సదరు విద్యార్థిని అదృశ్యంపై ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సంగీత ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. విషయం తెలియగానే ఈ విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ శ్వేత గురువారం రాత్రికి రాత్రే గన్నారంలోని పాఠశాల, కళాశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం సైతం జిల్లా కన్వీనర్ పాఠశాలకు వచ్చి అదృశ్యమైన విద్యార్థిని దగ్గరి బంధువు కుమార్తె ఇదే పాఠశాలలో చదువుతున్నందున ఆమె నుంచి సమాచారం రాబట్టే ప్రయత్నం చేశారు. బాలిక కుటుంబ సభ్యులను చరవాణిలో సంప్రదించి వాకబు చేశారు. ఎస్సై రామనకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టినప్పటికీ విద్యార్థిని ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై విచారణ చేపట్టేందుకు ఈ విద్యాసంస్థల సెక్రటరీ సైదులు గన్నారంలోని పాఠశాల, కళాశాలకు రానున్నట్టు జిల్లా కన్వీనర్ తెలిపారు.

(c) eenadu



ఆర్కేపీలో ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు

అండర్-19 ఫుట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక పోటీలను శుక్రవారం రామకృష్ణాపూర్ ఠాగూర్ మైదానంలో నిర్వహించారు. కళాశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన బాలుర జట్టును ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ బాబురావు తెలిపారు వచ్చే నెల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పీడీ రాజయ్య, శిక్షకుడు రవికుమార్, పీఈటీ సురేందర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్..



ఎంపికైన విద్యార్థినితో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి

తాండూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన ఎం.అమూల్య ఎంపికైంది. అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో సత్తా చాటింది. అచ్చలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అమూల్య 8వ తరగతి చదువుతుంది. ఈ నెల 28వ తేదీ నుంచి 30 వరకు గోదావరిఖనిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ఆడనుంది. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు బి.ఉమాదేవి, పీడీ సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో పీడీ రాజయ్య

మంచిర్యాల క్రీడావిభాగం: మహబూబ్‌నగర్ జిల్లాలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రేణి రాజయ్య తెలిపారు. జిల్లాలో జరిగిన అండర్-19 బాలుర జోనల్‌స్థాయి పోటీల్లో కార్తీక్, వాగయ్య, ప్రణయ్ ప్రతిభ చాటి అర్హత సాధించారని చెప్పారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తాచాటేందుకు మరింత కసరత్తుకు సిద్ధమవుతున్నారని, జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా సాధన చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

హాకీ పోటీలు ప్రారంభం

ఉట్నూరు: ఉట్నూరులోని కుమురం భీం మైదానంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలను ఐటీడీఏ డీడీ వసంత్‌రావు ప్రారంభించారు. గిరిజన విద్యార్థులు హాకీ క్రీడలో రాణించడం హర్షణీయమన్నారు. గిరిజన సంక్షేమశాఖ క్రీడాధికారులు పార్థసారథి, భుక్య రమేష్, హెచ్‌ఎం రాథోడ్ ఉత్తం, ఏఎస్‌వో హేమంత్, పవార్ లక్ష్మణ్, కోచ్‌లు రవీందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం.. మానవత్వపు నేస్తం



మళ్లీ..జీవాలను మేతకు తీసుకెళ్తున్న ఇనేష్

జీవితంపై పిడుగు దాతల గొడుగు..

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాంసింగ్ తండాకు చెందిన దివ్యాంగుడైన చవాన్ ఇనేష్‌కు గొర్రెల మందనే జీవనాధారం. ఎప్పటిలాగే వాటిని మేతకు తీసికెళ్లగా ఇటీవల పిడుగుపడి 70 జీవాలు మృత్యువాత పడ్డాయి. రోజూ వాటిని మేపేందుకు వెళ్లే ఆ వ్యక్తికి తెల్లవారి పని లేకుండా పోయింది. దాదాపు రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఏం చేయాలో తెలియని దైన్యం. ఈ స్థితిలో సమీప తండాల్లోంచి మానవతామూర్తులు కదిలివచ్చారు. తలా ఒకటి రెండు జీవాలను ఇనేష్‌కు ఇచ్చారు. పిడుగు పడి అతలాకుతలమైన ఆ బడుగు జీవిపై గొడుగు పట్టారు. 40 జీవాలను అందించి మళ్లీ ఆయనకు బతుకు దారి చూపించారు. ఒకరి కష్టాన్ని పది మంది పంచుకుంటే సమస్య ఎంత తేలికవుతుందో నిరూపించారు ఆ మంచి మను(సు)షులు..

సహజంగా ప్రతి మనిషికీ ఏవో కష్టాలు వస్తూనే ఉంటాయి. వాటిని ఎదుర్కోలేని పరిస్థితుల్లో ఉన్న వారు అల్లాడుతుంటారు. అయ్యో నాకు ఇలా అయ్యిందేంటీ అని బాధపడుతుంటారు. దేవుడా నన్ను గట్టెక్కించూ అని వేడుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఎవరైనా చేయూతనిస్తేనో.. చేతనైనంత సాయం చేస్తేనో ఊరట పొందుతారు. తాను కొలిచే దైవమే సాక్షాత్తూ కళ్ల ముందుకు వచ్చిందని ఆ మనిషిలో దేవుణ్ని చూస్తారు. మానవత్వం పరిమళించి తోటి వారి ఇబ్బందుల్లో పాలుపంచుకునే వారు ఎదుటి వారి గుండెల్లో గూడు కట్టుకుంటారు.

-న్యూస్‌టుడే, మామడ,

వా(హ్యా)ట్సాప్ (గ్రూపులు..

సామాజిక మాధ్యమాలు విస్తృతమయ్యాక సాయమందించే ఆలోచన ఉన్న చేతులు ఒక్కటవుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆపన్న హస్తం అందించే వారు బయటకొస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లో ‘రక్తదాతల’ గ్రూపులు చేస్తున్న సేవలకు హ్యాట్సాప్ చెప్పాల్సిందే. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌లలో కనీసం రోజుకు 20 మందికి పైగానే వాట్సాప్ గ్రూపుల్లో చూసి అవసరమున్న వ్యక్తులకు అత్యవసరంగా వెళ్లి రక్తదానం చేస్తున్నారు.

ఆకలిగా ఉన్న వారికి గుప్పెడు అన్నం, ఆపదలో ఉన్న వారికి కొంచెం సాయం, బాధలో ఉన్న వారికి ఓదార్పు అందించడం నిజమైన మానవత్వం.

ఎదుటి మనిషి కన్నీరు తుడవడానికి బంధుత్వమో, రక్త సంబంధమో, పేగు బంధమో ఉండనక్కర్లేదు. పిడికెడు గుండెలో చిటికెడు మానవత్వం ఉంటే చాలు

ఎన్ని మతాలున్నా అసలైన మతం మానవత్వం

ధన రాసులే ఉండక్కర్లేదు..

మానవత్వానికి కొలమానం డబ్బు మాత్రమే కాదు. ధనం దానం చేస్తేనే మేలు చేసినట్లు కాదు. ఎన్నో రకాలుగా మంచి చేయవచ్చు. ఒక్కోసారి మనం చేసే మాట సాయమే కొందరి జీవితాల్లో వెలుగులు నింపుతాయి. కింద పడిపోతున్న ఓ వ్యక్తిని పట్టుకోగలిగినా.. ప్రవాహంలో కొట్టుకుపోతున్న మనిషిని ఒడ్డుకు చేర్చగలిగినా, కారుమబ్బులు ఆవరించి కటిక చీకటిలా మారిన జీవితాల్లో వెలుగులను ప్రసరింప చేసే ఏ కార్యం చేసినా కాంతిమూర్తులవుతారు.

అభినందనీయం అభిమన్యు బృందం..

ఉట్నూరు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల వేదికగా ఏర్పాటైన ‘అభిమన్యు వాట్సాప్ గ్రూపు’ ఎన్నో సందర్భాల్లో ఆపదలో ఉన్న, అత్యవసరమైన వారికి అండగా నిలుస్తూ మానవత్వపు పరిమళాలు వెదజల్లుతోంది. దాదాపు పదేళ్ల క్రితం గాదిగూడ మండలం లోకారికి చెందిన శేఖర్‌బాబు ప్రారంభించిన ఈ గ్రూపులో 800 మంది సభ్యులున్నారు. వీరంతా కలిసి ఇప్పటి వరకు విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం రూ.లక్షల్లో సాయం చేశారు. అక్కడి మానవసేవయే మాధవ సేవ గ్రూపు సైతం సేవల్లో ముందుంటోంది.




చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సాయమందించి సన్మానిస్తూ..

బ్యాచ్‌మేట్లు..క్లాస్‌మేట్లు

ఆదుకునేందుకు రక్త సంబంధీకులు, బంధువులే కానక్కర్లేదని పరిచయస్తులు, మిత్రులైనా మేలు చేయొచ్చని నిరూపిస్తున్నారు చాలా మంది. కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు, ఒకేసారి కొలువు దక్కి ఒక చోట శిక్షణ పొందిన వారు ఎప్పటికీ కలిసుంటున్నారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు.

రూ.కోటి సాయం చేసి...

2014 సంవత్సరంలో ఎస్సైలుగా ఎంపికై ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న వారు ఓ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమ బ్యాచ్‌మేట్ల కష్టాలను పంచుకునేందుకు వారు చూపిస్తున్న మానవత్వం స్ఫూర్తిదాయకం. ప్రమాదాల్లో, ఇతర ఆరోగ్య సమస్యలతో మరణించిన తమ సహచరుల కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.కోటి వరకు సాయం చేశారంటే మాటలు కాదు. మేమంతా ఏడాదికి రూ.3 వేల సంక్షేమ సంఘానికి అందిస్తామని, అత్యవసరమైతే ఎక్కువ డబ్బులు తలా కొంత ఇస్తామని ఆ బ్యాచ్‌కు చెందిన లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపారు.



మరణించిన బ్యాచ్‌మేట్ కుటుంబానికి సాయమందిస్తూ..

మేమున్నామంటూ..

లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌లో 1997-98 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుల కష్టాల్లో పాలుపంచుకుంటున్నారు. మరణించిన ముగ్గురు క్లాస్‌మేట్ల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మరో ఇద్దరు స్నేహితుల వైద్యం కోసం రూ.45 వేలు అందించారు. ఇలా ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా అండగా నిలుస్తున్నారు.



మిత్రుని కుటుంబానికి ఆసరానిస్తూ..

బకాయిలు రాక.. భవనానికి తాళం



కాలక్షేప మండపానికి తాళం వేసిన గుత్తేదారు

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి మండలం కన్నాలలోని శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో నిర్మించిన కాలక్షేప మండపానికి గుత్తేదారు తాళం వేశారు. భక్తుల సౌకర్యం కోసం సుమారుగా రూ. 50 లక్షలు వెచ్చించి నిర్మించారు. పనులు పూయి రెండేళ్లు అవుతున్నా ఇంకా దేవాదాయ శాఖకు సదరు గుత్తేదారు అప్పగించనట్లు సమాచారం. క్యాసీ పనులు కాకపోవడంతో ఇంకా పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాలేదు. అనధికారికంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంతో పగుళ్లు వస్తున్నట్లు, అధికారులు పరిశీలనకు వస్తే రావాల్సిన డబ్బుల్లో కోత పడుతుందని తాళం వేసినట్లు తెలిసింది.

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు



నస్పూర్‌లో ఏర్పాటు చేసిన ల్యాబ్ కార్యాలయం

మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆత్మహత్యలు, హత్యలు, దొంగతనాల వంటి నేరాలలో విశ్వసనీయంగా నేర పరిశోధన జరిపే ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ మంచిర్యాలలో ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు మంచిర్యాలతో పాటు ఖమ్మంలో ఈ ల్యాబ్‌లను ప్రారంభించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. హత్య, హత్యాచారం, దోపిడీ కేసుల్లో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణం సంభవించిన మరణాల కారణం తెలుసుకోవడం కోసం వైద్యులు మృతుల రక్తం, ఇతర శరీర భాగాలను పరీక్షించి కరీంనగర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించేవారు. ఇకపై మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు సంబంధించిన కేసులతో పాటు పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సబ్‌డివిజన్ కేసులు సైతం మంచిర్యాలలోని ల్యాబ్‌లోనే పరీక్షించనున్నారు. దీంతో కేసు పురోగతిలో వేగవంతం కానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

EENADU Classifieds

EDUCATION
MBA/ MCA Management Quota Seats are available, Interested Candidates may Contact: 96662 97888, 63015 19880.

FACULTY/ TEACHERS
Wanted Computer Faculty / Teachers, Minimum 2 years Experience Required Star Computers Asifabad. Ph: 9948724728.

REAL ESTATE
PLOT FOR SALE

JOBS


Book Your 5 Lines Classified Advertisement for B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable on any day
For further details Contact: Adilabad: 99590 97631 90005 66042

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99590 97631 90005 66042
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80083 42688

గుస్సాడీకి జీవం పోసిన కనకరాజు

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, జైనూర్: :

రాజ్‌గొండ్‌ల ప్రాచీన విశిష్ట కళ గుస్సాడీ నృత్యం. తలపై నెమలి ఈకలతో అల్లిన టోపి, చేతిలో దండారి, కాళ్లకు గజ్జలు, జంతువుల చర్మంతో చేసిన వస్త్రాలతో పురి విప్పిన నెమలిలా కనకరాజు గుస్సాడీ నృత్యం చేస్తే చూసేందుకు రెండుకళ్లూ చాలవు. ఇందులో ప్రావీణ్యం సంపాదించిన ఆయన ఆదివాసీల నృత్యకళకు జీవం పోశారు. దేవతామూర్తులను ఆరాధించే దండారీ నుంచే స్ఫూర్తి పొంది గుస్సాడీని నేర్చుకున్నానని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. చుట్టు పక్కల పరిసరాల గిరిజనులు ఈయనను ఆదినుంచి కనకరాజుగా కాకుండా గుస్సాడీ రాజుగానే పిలిచేవారు. ఆయన మృతితో ఆదివాసులు శోకసంద్రంలో మునిగారు



ఇందిరాగాంధీ పక్కన (ఎడమ నుంచి మొదటి వ్యక్తి) కనకరాజు

ఇందిరాగాంధీ ముందు ప్రదర్శన

1982లో దేశరాజధాని దిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు ప్రదర్శన ఇచ్చారు. అప్పటి ఆదివాసీ, ఉట్నూరు ఐఏయస్ అధికారి తుకారం సిర్పూరు మండలంలోని పిట్టగూడ గ్రామంలో దండారీ (గుస్సాడీ) ఉత్సవాల్లో నైపుణ్యంలో వీరికి శిక్షణ ఇప్పించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన కనకరాజుతోపాటు సార్మెడీ మెస్రం దుర్గారావును దిల్లీకి పంపించారు. కనకరాజు నృత్యాన్ని చూసి ఇందిరాగాంధీ ముగ్ధురాలుకాగా, ఆమె కాలికి కనకరాజు గజ్జెలు కట్టడంతో ప్రధాని సైతం వీరితో పాదం కలిపారు. 2002లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం ముందు చేసిన గుస్సాడీ నృత్యానికి ఆయనను అభినందించారు. ఇప్పటి వరకు 350 పైగా ప్రదర్శనలు ఇచ్చారు. వందలాది మంది ఉత్సాహవంతులైన గిరిజనులకు ఈ నృత్యంలో తర్ఫీదునందించారు. తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి ఆదివాసీ కళాకారునిగా చరిత్రకెక్కారు. కనకరాజుకు ఇద్దరు భార్యలు ఉండగా, నలుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్లు ఉన్నారు.



గుస్సాడీ కళాకారులకు శిక్షణ ఇస్తున్న కనకరాజు



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న కనకరాజు

పోరాటయోధుడు కుమురం భీం మరణం తరువాత నిజాం మానవ పరిణామ శాస్త్రవేత్త హేమన్‌డార్ఫ్‌ను గిరిజనుల స్థితిగతులు తెలుసుకోవడానికి జిల్లాకు పంపించారు. హేమన్‌డార్ఫ్ కొన్ని సంవత్సరాలపాటు మర్లవాయిలోనే ఉన్నారు. ఆదివాసీలతో మమేకమై వారి జీవన విధానం, కావాల్సిన మౌలిక సౌకర్యాలను అధ్యయనం చేశారు. ఈ సమయంలో కనకరాజు ఈయనతోనే ఎక్కువ సమయం గడిపేవారు. బాలుడి నుంచి యువకుడి వరకు హేమన్‌డార్ఫ్‌తో కలిసి ఉన్నానని పలు సందర్భాల్లో తెలిపారు.

ఎమ్మెల్యే శంకర్‌కు తప్పిన ప్రమాదం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పాయల్ శంకర్ త్రుటిలో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. మూసీ బాధితులకు అండగా భాజపా హైదరాబాద్‌లో శుక్రవారం చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిలాబాద్‌లో రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకుని హుటాహుటిన బయలుదేరారు. మార్గమధ్యలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఎక్స్‌రోడ్డు సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఎమ్మెల్యే వాహనాన్ని ఢీకొట్టింది. వెనక అద్దాలు పగిలాయి. ఆ సమయంలో ఎమ్మెల్యేతో పాటు పీఏ మనోజ్‌పవార్, డ్రైవర్ నవీన్ ముగ్గురే పయనిస్తున్నారు. వెనుక సీటులో కూర్చున్న మనోజ్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. రెండు వాహనాల వేగం తక్కువగా ఉండటంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద విషయం తెలిసి ఎమ్మెల్యే బంధువులు, అభిమానులు అంతా హైరానా చెందారు. ఎమ్మెల్యే తనకేం కాలేదని వీడియో సందేశం విడుదల చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. రాత్రి ఆదిలాబాద్‌కు చేరుకున్న ఎమ్మెల్యే నేరుగా మార్కెట్‌యార్డుకు చేరుకుని పాలనాధికారి రాజర్షిషా సమక్షంలో వ్యాపారులు, రైతులతో జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.



పగిలిన వాహన అద్దాలు

28న పీఎఫ్ మీ ముంగిట

చైతన్యపురి, న్యూస్‌టుడే : కరీంనగర్ భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈనెల 28న పీఎఫ్ మీ ముంగిట (నిధి ఆప్కే నికత్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ సెల్వత్కర్ తానయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అవగాహన కల్పించి, భవిష్యనిధి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

జిల్లా	కార్యక్రమం జరిగే ప్రదేశం
ఆదిలాబాద్:	నలంద డిగ్రీ కళాశాల సమావేశ గది
మంచిర్యాల:	కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్
కుమురంభీం:	సిర్పూర్ కాగజ్‌నగర్ శ్రీకృష్ణవేణి హైస్కూల్
నిర్మల్ :	ఇబ్రహీంబాగ్ రవి ఉన్నత పాఠశాల

ఇంతి.. సింగరేణి కాంతి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:

● 16 రకాల పనులు ఎంచుకునే అవకాశం..

పురుషాధిక్యం ఉన్న సింగరేణిలో మహిళా ఉద్యోగులకు తమ ఉనికిని చాటుకునేందుకు అవకాశం లభించింది. సంస్థలో కారుణ్య నియామకాలు మొదలైన తర్వాత ఉద్యోగాల్లో చేరుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. వీరిలో ఉన్నత విద్య అభ్యసించిన వారు చాలా మంది ఉన్నారు. వీరందరూ సాధారణ ఉద్యోగులు(జనరల్ మజ్దూర్)గా తమ సేవలు అందిస్తున్నారు. భూగర్భ గనుల్లో వీరు విధులు నిర్వర్తించేందుకు అవకాశం లేకపోవడంతో వీరి సేవలు సంస్థ కార్యాలయాల్లోనే వినియోగించుకుంటున్నారు. సంస్థలో ప్రస్తుతం మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతుండటంతో వీరిని ఉపరితలంలోనే 16 రకాల సేవలు వినియోగించుకోవాలని యాజమాన్యం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేట్, ఏరియా స్థాయిల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ విద్యార్హత ఆధారంగా ఉద్యోగినులు ఎంచుకున్న పనులపై శిక్షణ ఇవ్వనుంది.

ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శించేందుకు..



కాసిపేట గనిపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కన్వేయర్ ఆపరేటర్, పంపు ఆపరేటర్, వాల్వ్ ఆపరేటర్, చార్జర్ సేఫ్టీ ల్యాంప్, ల్యాంప్ రూం పిట్టర్, కుక్, వెండార్, సర్వే మజ్దూర్, స్టోర్స్ ఇష్యూ మజ్దూర్, బైండర్, శాంప్లింగ్ మజ్దూర్, ఈపీ గ్రీసర్, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్ వంటి ముఖ్యమైన పనులు ఉన్నాయి. వీటిలో వారు ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శిస్తే మంచి గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగినులు ఎంచుకున్న పనులపై శిక్షణ ఇచ్చి తర్వాత ఆయా పనులు కేటాయిస్తుంది. ఆయా కేటగిరీల్లో అంతర్గత పరీక్షలు రాసి ఉన్నత స్థితికి చేరుకునే అవకాశముంది. ఉన్నత విద్య అభ్యసించి కార్యాలయాల్లో అటెండర్లుగా పని చేసిన వారు ఇకపై సాంకేతిక పరమైన పనుల్లో ప్రతిభ చాటుకునేందుకు వీలు ఏర్పడింది.

కాసిపేట: కాసిపేట గనిలో మహిళా ఉద్యోగులకు ఖాళీగా ఉన్న వివిధ శాఖల ఉద్యోగాలకు శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఖాళీగా ఉన్న 16 ఉద్యోగాల కోసం మహిళా ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంచుకున్న ఉద్యోగానికి ముందుగా ఉద్యోగులకు శిక్షణ ఇస్తామన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎంఐఈడీ రాజన్న, వైద్యురాలు భవాని, రామదాసు, భూశంకరయ్య ఉన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌గా దివ్య



శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో జనరల్ మజ్దూర్ ఉద్యోగిని బి.దివ్య కంప్యూటర్ ఆపరేటర్‌గా సేవలు అందిస్తున్నారు. 2022లో సంస్థలో చేరిన ఆమె ఎంఎస్‌సీ(మ్యాథమేటిక్స్) పూర్తి చేశారు. విద్యార్హత మేరకు అధికారులు ఆమెకు విధులు కేటాయించారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా దివ్య సంస్థకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. మహిళా ఉద్యోగులు యాజమాన్యం సూచించిన పనుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆమె చెబుతున్నారు.

ఫైళ్ల కూర్పులో నేర్పరి




ఏరియాలోని సీహెచ్‌పీలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గుడికందుల స్వప్న 2023లో సంస్థలో చేరారు. ఎంబీఏ(హెచ్‌ఆర్‌ఎం) పూర్తి చేసిన ఆమె కార్యాలయంలో చురుకైన పనులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు, సంస్థకు చెందిన ఫైళ్లను భద్రపర్చడం, వాటిలో ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. యాజమాన్యం సూచించిన పనుల్లో కార్యాలయ అటెండెంట్ ముఖ్యమైన పనే అని స్వప్న అంటున్నారు.

ఈ సన్నాలకే బోనస్



సాగవుతున్న సన్న రకాలు



నిర్మల్, న్యూస్‌టుడే: సన్నరకం ధాన్యం క్వింటాలుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు అన్నదాతల్లో నెలకొన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం 33 సన్నరకాలు గుర్తించింది. సన్నరకం గింజ పొడువు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, మందం 2 మిల్లీమీటర్ల కంటే ఉండాలని ప్రమాణాలు నిర్దేశించింది. ఆ వంగడాలు ఇవే..

సిద్ధి	(డబ్ల్యూజీఎల్-44)
కంపసాగర్-1	(కేపీఎస్-2874)
సాంబమసూరి	(బీపీటీ-5204)
జగిత్యాల-3	(జేజీఎల్27356)
జగిత్యాల-2	(జేజీఎల్285545)
వరంగల్ సాంబ	(డబ్ల్యూజీఎల్-14)
వరంగల్ సన్నాలు	(డబ్ల్యూజీఎల్-32100)
జగిత్యాల మసూరి	(జేజీఎల్-11470)
పొలాస ప్రభ	(జేజీఎల్-384)
కృష్ణ	(ఆర్ఎన్ఆర్-2458)
మానేరు సోనా	(జేజీఎల్-3828)
తెలంగాణ సోనా	(ఆర్ఎన్ఆర్-15048)
వరంగల్ వరి	-1119
కూనారం వరి-1	(కేఎన్ఎం-733)
కూనారం వరి-2	(కేఎన్ఎం-1638)
వరంగల్ వరి-2	(డబ్ల్యూజీఎల్-962)
రాజేంద్రనగర్ వరి-4	(ఆర్ఎన్ఆర్-21278)
జగిత్యాల సన్నాలు	(జేజీఎల్-1798)
జగిత్యాల సాంబ	(జేజీఎల్-3844)
కరీంనగర్ సాంబ	(జేజీఎల్-3855)
అంజన	(జేజీఎల్-11118)
నెల్లూరి మసూరి	(ఎన్ఎల్ఆర్-34449)
ప్రత్యూమ్న	(జేజీఎల్-17004)
సుగంధ సాంబ	(ఆర్ఎన్ఆర్-2354)
శోభిని	(ఆర్ఎన్ఆర్-2354)
సోమనాథ్	(డబ్ల్యూజీఎల్-347)
ఆర్ఎన్ఆర్	-31479 (పీఆర్‌సీ)
కేపీఎస్	-6251 (పీఆర్‌సీ)
జేజీఎల్	-33124(పీఆర్‌సీ)
హెచ్ఎంటీ సోనా	
మారుటేరు సాంబ	(ఎంటీయూ-1224)
మారుటేరి మసూరి	(ఎంజీయూ-1262)
ఎంటీయూ-1271	